సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శుక్రవారం
20-06-2025
పేజీలు: 02






# కుబేర రివ్యూ

## ధనుష్ తన నటనతో ఆడియెన్స్‌ని సర్‌ప్రైజ్ చేశాడు..

ధనుష్ – నాగార్జున హీరోలుగా శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో తెరకెక్కిన లేటెస్ట్ మూవీ 'కుబేర'. కాగా భారీ అంచనాల నడుమ ఈ సినిమా ఈ రోజు థియేటర్లలో విడుదలైంది. ఈ చిత్రం ఎలా ఉందో రివ్యూలోకి వెళ్ళి చూద్దాం. దీపక్ (నాగార్జున) నిజాయితీగల ఒక సీబీఐ అధికారి. అయితే, తన నిజాయితీ కారణంగా కొంతమంది వ్యక్తులు పెట్టిన తప్పుడు కేసులతో జైలులో ఉంటాడు. తాను నమ్ముకున్న న్యాయం దీపక్ కు జరగదు. మరోవైపు నీరజ్ మిత్ర (జిమ్ సర్భ్) ఒక పెద్ద పారిశ్రామికవేత్త. దేశానికి 15 ఏళ్ల పాటు సరిపడే చమురు నిల్వలు దొర్కుతాయి. మంత్రితో రహస్య ఒప్పందం చేసుకుని, ఆ చమురు కొట్టేయాలని ప్లాన్ చేస్తాడు. ఈ ప్లాన్ కి ఒక్క దీపక్ మాత్రమే కరెక్ట్ అని జైలు నుంచి దీపక్ ను బయటకు తెస్తాడు. ఈ క్రమంలో జరిగిన కొన్ని నాటకీయ పరిణామాల నేపథ్యంలో నాలుగు బినామీ ఖాతాలలో రూ.1 లక్ష కోట్లు బదిలీ చేయాలని ప్లాన్ చేస్తారు. ఆ నలుగురు బెగ్గర్స్ లో దేవ (ధనుష్) ఒకడు. మరి దీపక్ వేసిన ప్లాన్ వర్కౌట్ అయిందా ?, ఇంతకీ, దేవ పాత్ర ఏమిటి ?, గతంలో దేవాకి – దీపక్ కు మధ్య సంబంధం ఏమిటి ? అనేది మిగిలిన కథ. ధనవంతుడు-పేదవాడు అనే కాన్సెప్టుతో ఇప్పటికే ఎన్నో సినిమాలు వచ్చాయి. కానీ, ఈ కుబేర సినిమాలో ట్రీట్మెంట్ కొత్తగా ఉంది. జీవితంలో తనకేమీ అక్కరలేదనుకునే ఒక బిచ్చగాడు, నిజాయితీని నమ్ముకుని జైలు పాలు అయినా మరో నిజాయితీ పరుడు.. వీరిద్దరి మధ్య డబ్బే ఊపిరిలా బ్రతికే ఓ బిజినెస్ మెన్.. మొత్తానికి ఈ పాత్రల మధ్య డ్రామాతో శేఖర్ కమ్ముల ఆకట్టుకున్నాడు. తన మార్క్ స్క్రీన్ ప్లేను జోడించి ఈ సినిమాని స్పెషల్ మూవీగా మార్చేశాడు శేఖర్ కమ్ముల. ఇక నటీనటుల విషయానికి వస్తే నాగార్జున తన పాత్రలో ఒదిగిపోయారు. నిజాయితీగా బతకాలనుకుని.. తప్పుడు వ్యక్తుల వైపు నిలబడే సీబీఐ ఆఫీసర్ క్యారెక్టర్‌లో నాగ్ కనిపించారు. ఆయన కెరీర్‌లో ఇది నిలిచిపోయే క్యారక్టర్ అవుతుంది. క్యారెక్టర్ ముగింపు కూడా ఎమోషనల్ గా బాగుంది. బెగ్గర్‌గా కనిపించిన ధనుష్ తన నటనతో ఆడియెన్స్‌ని సర్‌ప్రైజ్ చేశాడు. దేవ పాత్రలో ఆయనను తప్ప మరొకరిని ఊహించలేం. ధనుష్ నటన ఆ స్థాయిలో ఉంది. హీరోయిన్ గా రష్మిక మందన్నా మరోసారి అద్భుతమైన నటనను కనబరిచింది. తన స్క్రీన్ ప్రజెన్స్‌తో కూడా ఆమె మెప్పించింది. విలన్ గా జిమ్ సర్భ్ పెర్ఫెక్ట్ గా సెట్ అయ్యారు. అలాగే దలీప్ తాహిల్, కల్నల్ రవి శర్మ, సునయనలతో పాటు మిగిలిన నటీనటులు కూడా అయా పాత్రల్లో తమ నటనతో మెప్పించారు. ఇక లక్ష కోట్ల స్కాం కథ_ _ _బాగా డబ్బున్న వాళ్ళకి, ఏమి లేని వాళ్ళకి మధ్య జరిగిన ఈ డ్రామాలో ఎమోషన్స్ కూడా చాలా బాగున్నాయి. శేఖర్ కమ్ముల పాత్రల చిత్రీకరణతో పాటు ఆ పాత్రల నేపథ్యాన్ని కూడా పర్ఫెక్ట్ గా డిజైన్ చేశారు. బరువైన ఎమోషన్స్ తో వచ్చిన ఈ ఎమోషనల్ ఎంటర్ టైనర్ కుబేర చాలా వరకు బాగా ఆకట్టుకున్నా.. కథనం పరంగా వచ్చే కొన్ని సీన్స్ సినిమా స్థాయికి తగ్గట్లు పూర్తి స్థాయిలో ఆకట్టుకోవు. అలాగే సినిమాలో ఉన్నంత హైప్ ను సినిమా మొత్తం కంటిన్యూ చేయలేక పోయారు. ఇక నాగార్జున – విలన్ల మధ్య ట్రాక్ ఇంకా బెటర్ గా ఉండి ఉంటే బాగుండేది. మొత్తానికి కథలో చెప్పాలనుకున్న మెయిన్ థీమ్ తో పాటు కీలక సన్నివేశాల్లో మంచి పనితీరుని కనబర్చిన దర్శకుడు శేఖర్ కమ్ముల, మిగిలిన కొన్ని సన్నివేశాల్లో మాత్రం నెమ్మదిగా కనిపించారు. ఈ సినిమాకు సంబంధించి సాంకేతిక విభాగం గురించి మాట్లాడుకుంటే.. సినిమాటోగ్రాఫర్ నికేత్ బొమ్మిరెడ్డి సినిమాటోగ్రఫీ వర్క్ అద్భుతంగా ఉంది. సినిమాలోని కీలక సన్నివేశాలతో పాటు మిగిలిన యాక్షన్ సన్నివేశాలను కూడా కథాకథనాలకు అనుగుణంగా అద్భుతంగా చిత్రీకరించారు. కార్తీక శ్రీనివాస్ ఎడిటింగ్ కూడా చాలా బాగుంది. ఇక సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ సమకూర్చిన పాటలు చాలా బాగున్నాయి. వాటి పిక్చరైజేషన్ కూడా బాగుంది. నేపథ్య సంగీతం కూడా ఆకట్టుకుంది. శేఖర్ కమ్ముల రచయితగా దర్శకుడిగా ఈ చిత్రానికి పూర్తి న్యాయం చేశారు. మంచి కథ, బలమైన వైవిధ్యమైన పాత్రలతో చిత్రాన్ని ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. కానీ, కొన్నిచోట్ల ఆయన కథనాన్ని ఇంకా ఆసక్తికరంగా మలిచి ఉంటే బాగుండేది. నిర్మాతలు సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు. వారి నిర్మాణ విలువలు అద్భుతంగా ఉన్నాయి. సోషల్ అండ్ ఎమోషనల్ డ్రామాగా వచ్చిన ఈ 'కుబేర'లో.. గుడ్ సోషల్ మెసేజ్ తో పాటు ఫీల్ గుడ్ ఎమోషన్స్ కూడా చాలా బాగున్నాయి. ముఖ్యంగా ధనుష్ – నాగార్జున తమ పవర్ ఫుల్ నటనతో, శేఖర్ కమ్ముల తన దర్శకత్వంతో చాలా బాగా ఆకట్టుకున్నారు. మొత్తం సాంకేతిక విభాగం నుంచి అందిన మంచి పనితనం.. మొత్తం సినిమాకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కానీ, కొన్ని సన్నివేశాలు రోటీన్ గా సాగడం వంటి అంశాలు మైనస్ అయ్యాయి. ఐతే, ధనుష్ తన నటనతో, నాగార్జున తన ఇమేజ్ తో ఈ సినిమాని మరో లెవల్ కి తీసుకు వెళ్లారు. ఓవరాల్ గా ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తుంది.





# 8 వసంతాలు రివ్యూ

ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో వచ్చిన సినిమా '8 వసంతాలు'. కాగా ఈ చిత్రం ఈ రోజు రిలీజ్ అయింది. మరి సినిమా ఎలా ఉందో రివ్యూలోకి వెళ్లి చూద్దాం. శుద్ధి అయోధ్య (అనంతిక) తన తండ్రి చనిపోయిన బాధలో ఉండగా, ఆ బాధ నుంచి బయటపడటం కోసం రచయిత్రిగా మారుతుంది. ఇండియాలో ఉన్న ఆస్తులు అమ్మడం కోసం ఊటీ వచ్చిన వరుణ్ (హను రెడ్డి) శుద్ధితో ప్రేమలో పడతాడు. అతని కేరింగ్ చూసి శుద్ధి కూడా అతన్ని ఇష్టపడుతుంది. అప్పటి వరకు తన ప్రపంచంలో తాను బతుకుతున్న శుద్ధిని ప్రేమలోకి దించుతాడు. చివరకు వరుణ్ తన స్వార్థాన్ని చూసుకుని శుద్ధిని నడి రోడ్డున వదిలేసి వెళ్తాడు. స్వాభిమానం, ఆత్మ గౌరవం ఉన్న శుద్ధి ఏం చేస్తుంది? శుద్ధి జీవితంలో సంజయ్ (రవి దుగ్గిరాల) పాత్ర ఏంటి ? అయితే సంజయ్ మీద ఉన్నప్రేమను బయటపెట్టకుండా, శుద్ధి మరో యువకుడితో పెళ్లికి ఎందుకు రెడీ అవుతుంది ?, ఇంతకీ సంజయ్, శుద్ధి ఒకటయ్యారా ? లేదా ? అనేది మిగిలిన కథ. 8 వసంతాలు అంటూ సాగిన ఈ సినిమా ఫిల్ గుడ్ లైఫ్ జర్నీలో డైలాగ్స్, కొన్ని ప్రేమ సన్నివేశాలు, అలాగే పాత్రలు. పాత్రల పాయింటాఫ్ ఎమోషన్స్ చాలా బాగున్నాయి. ప్రాణంగా ప్రేమించిన వ్యక్తి దూరం అయితే.. ఆ ప్రేమిస్తున్న వ్యక్తి మానసిక పరిస్థితి ఎలా ఉంటుంది ?, తన ప్రేమతో తన ప్రేయసి ప్రేమను దక్కించుకోవడానికి సంజయ్ పాత్ర చేసిన ప్రయత్నాలు ఏమిటి.. ఈ మధ్యలో ప్రేమికుల మధ్య ఎమోషన్స్ మరియు కొన్ని ఫీల్ గుడ్ సీన్స్ అండ్ డైలాగ్స్.. ఇవ్వన్నీ ఈ సినిమాకి ప్లస్ అయ్యాయి. హీరోయిన్ గా నటించిన అనంతిక సనీల్‌కుమార్ నటన




సినిమాకి ప్లస్ అయింది. ప్రధానంగా సెకండ్ హాఫ్ లో ఆమె నటించిన విధానం సినిమాకి ప్లస్ అయ్యింది. హను రెడ్డి తన పాత్రకి పూర్తి న్యాయం చేశారు. ఈ సినిమాలో హీరోగా నటించిన రవితేజ ఈజ్ తో సెటిల్డ్ గా నటించాడు. ముఖ్యంగా క్లైమాక్స్ లో అలాగే కొన్ని ప్రేమ సన్నివేశాల్లో రవితేజ నటన బాగుంది. దర్శకుడు స్మరన్ రెడ్డి రాసుకున్న మెయిన్ థీమ్ బాగుంది. సెకండ్ హాఫ్ లో భావోద్వేగాలను కూడా దర్శకుడు ఎమోషనల్ గా బాగానే తెరకెక్కించాడు. ఈ 8 వసంతాలు కథలో ముగింపు స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచినా, కథ కథానాలు మాత్రం రెగ్యులర్ గానే సాగాయి. నిజానికి సినిమా మెయిన్ పాయింట్ లో మ్యాటర్ ఉన్నపటికీ.. ఆ పాయింట్ కి తగ్గట్టు స్క్రీన్ ప్లే రాసుకోవడంలో దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి విఫలం అయ్యాడు. హీరోహీరోయిన్ల మధ్య ప్రేమకు సంబంధించిన ట్రాక్ ను ఇంకా బలంగా బిల్డ్ చేసి ఉండాల్సింది. అసలు ఇలాంటి ఎమోషనల్ కాన్సెప్ట్ తీసుకున్నప్పుడు ఆ కాన్సెప్ట్ కి తగ్గట్టు సినిమాని ఆద్యంతం బరువైన భావోద్వేగాలతో.. బలమైన పాత్రలతో స్క్రీన్ ప్లేను నడపాలి. కానీ అలా జరగలేదు. కేవలం డైలాగ్స్ కోసం సీన్స్ ను రాసుకున్న ఫీలింగ్ కలుగుతుంది. అలాగే పాత్రల మధ్య ఇంకా బలమైన కాన్ ఫ్లిట్ ను, సన్నివేశాలను రాసుకొని ఉండి ఉంటే బాగుండేది. ఇక సాంకేతిక నిపుణుల గురించి మాట్లాడుకుంటే.. దర్శకుడు ఫణీంద్ర నర్సెట్టి దర్శకుడిగా కొన్ని చోట్ల పర్వాలేదనిపించాడు. ఆయన రాసుకున్న స్క్రీన్ ప్లే ఇంట్రెస్ట్ గా సాగలేదు. కాకపోతే, ఆయన డైలాగ్స్ చాలా బాగున్నాయి. సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ అందించిన సంగీతం పర్వాలేదు. ఎడిటర్ శశాంక్ అనవసరమైన సీన్స్ ని ఇంకా టైట్ గా ట్రీమ్ చేసి ఉండి ఉంటే, సినిమాలో చాలా వరకు బోర్ తగ్గేది. సినిమాలో సినిమాటోగ్రఫీ వర్క్ బాగుంది. కొన్ని విజువల్స్ ను చాలా సహజంగా అలాగే చాలా అందంగా చూపించారు. ఫైనల్ గా నిర్మాణ విలువలు బాగానే ఉన్నాయి. '8 వసంతాలు' అంటూ వచ్చిన ఈ ఎమోషనల్ లవ్ డ్రామాలో.. ఎమోషనల్ గా సాగే క్లైమాక్స్, హీరో – హీరోయిన్ల మధ్య వచ్చే కొన్ని లవ్ సీన్స్ ముఖ్యంగా డైలాగ్స్ బాగానే ఉన్నాయి. కానీ, కథాకథనాలు ఆకట్టుకునే విధంగా లేకపోవడం, మెయిన్ క్యారెక్టరైజేషన్స్ బలహీనంగా ఉండటం, అలాగే కొన్ని లాజిక్ లెస్ సీన్స్ వంటి అంశాలు సినిమాకి మైనస్ అయ్యాయి. ఐతే, ఓ స్వచ్ఛమైన ప్రేమకు నిర్వచనాన్ని చెప్పే ప్రయత్నం చేశారు. ఓవరాల్ గా, లవర్స్ కు ఈ సినిమాలో కొన్ని ఎలిమెంట్స్ కనెక్ట్ అయినా, మిగిలిన వర్గాల ప్రేక్షకులకు మాత్రం ఈ సినిమా కనెక్ట్ కాదు.

## సూర్య కొత్త సినిమా టైటిల్ కరుప్పు

కోలీవుడ్ స్టార్ నటుడు సూర్య హీరోగా ఇప్పుడు తెలుగు సహా తమిళ్ లో కూడా సాలిడ్ లైనప్ లో ఉన్న సంగతి తెలిసిందే. మరి తన కెరీర్ 45వ సినిమా కోలీవుడ్ టాలెంటెడ్ నటుడు దర్శకుడు ఆర్ జె బాలాజీ కాంబినేషన్ లో అనౌన్స్ చేసిన సినిమా నుంచి ఇపుడు మేకర్స్ సాలిడ్ అప్డేట్ వచ్చేసింది. ఈ సినిమా కోసం ఎదురు చూస్తున్న ఫ్యాన్స్ కి సాలిడ్ అప్డేట్ వచ్చేసింది. ఈ చిత్రం నుంచి పవర్ఫుల్ టైటిల్ గా 'కరుప్పు' ని లాక్ చేసి అనౌన్స్ చేశారు. ఇక దీనితో పాటుగా సాలిడ్ మాస్ ప్రీ లుక్ పోస్టర్ ని కూడా సూర్యపై డిజైన్ చేయడంతో ఫ్యాన్స్ మళ్ళీ వింటేజ్ సూర్య రేంజ్ మాస్ ని ఆశిస్తున్నారు. మరి ఆర్జే బాలాజీ సూర్యతో ఏం ప్లాన్ చేస్తున్నాడో చూడాలి. ఇక ఈ చిత్రానికి ఏ ఆర్ రెహమాన్ సంగీతం అందిస్తుండగా డ్రీం వారియర్ పిక్చర్స్ వారు నిర్మాణం వహిస్తున్నారు.



నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## యోగాను ప్రజల జీవితంలో భాగం చేస్తామన్న చంద్రబాబు

యోగా భారతీయ వారసత్వ సంపదని, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రతి ఒక్కరి జీవితంలో యోగాను భాగస్వామ్యం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. రేపు విశాఖపట్నంలో నిర్వహించనున్న 'యోగాంధ్ర' కార్యక్రమంపై నిన్న ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమాన్ని ఒక ఉద్యమ స్ఫూర్తితో చేపడుతున్నట్టు వెల్లడించారు.ప్రజల ఆరోగ్యం కోసం యోగాకు విస్తృత ప్రచారం కల్పించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ పద్ధతుల్లో శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. తొమ్మిదో తరగతి, ఆపై చదువుతున్న విద్యార్థులతో రోజూ పది నిమిషాల పాటు యోగా చేయించడం ద్వారా వారిలో చదువుపై ఏకాగ్రత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. భవిష్యత్తులో యోగా కోర్సులను ప్రవేశపెడతామని, ప్రతి పాఠశాలలో వారానికి రెండు యోగా క్లాసులు ఉండేలా సిలబస్ రూపొందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఎన్టీఆర్ యోగా పరిషత్‌ను ఏర్పాటు చేశామని, అది తెలంగాణకు వెళ్లిపోయిందని గుర్తుచేశారు. స్వర్ణాంధ్ర తరహాలో యోగా కోసం ఒక లాభాపేక్ష లేని సంస్థను నాన్-ప్రాఫిట్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేసి, కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో ప్రచారం కల్పించాలని నిర్ణయించినట్టు తెలిపారు. యోగా, నేచురోపతి కోర్సులతో ఒక డీమ్డ్ యూనివర్సిటీని కూడా ఏర్పాటు చేస్తామని చంద్రబాబు ప్రకటించారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. ఇద్దరు మావోయిస్టులు మృతి

చత్తీస్‌గఢ్ దండకారణ్యంలో భద్రతా దళాలు — మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్లు తెలుస్తోంది. వివరాలిలా ఉన్నాయి.. చత్తీస్‌గఢ్ రాష్ట్రం కాంకేర్ జిల్లా చోటే భేతియా పోలీస్ స్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో మావోయిస్టులు ఉన్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు బీఎస్ఎఫ్ — డిఆర్జి భద్రతా దళాలు సంయుక్తంగా సెర్చింగ్ ఆపరేషన్ నిర్వహించాయి. ఈ క్రమంలో ఆమతోల — కల్పార్ గ్రామాల మధ్య ఉన్న కొండ ప్రాంతాల్లో శుక్రవారం మావోయిస్టులు తారాసపడి భద్రతా దళాలపై కాల్పులు జరిపారు. వెంటనే అప్రమత్తమైన భద్రతా దళాలు ఎదురుకాల్పులు ప్రారంభించాయి. ఇరు వర్గాల మధ్య సుమారు 30 నిమిషాల పైనే ఎదురు కాల్పులు చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. జవాన్ల ధాటికి తాళలేక మావోయిస్టులు కాల్పులు జరుపుతూనే దట్టమైన అటవీ మార్గంలో పారిపోయారు. కాల్పుల విరమణ అనంతరం భద్రతా దళాలు సంఘటన స్థలం నుంచి ఓ మహిళా మావోయిస్టు మృతదేహాన్ని స్వాధీనపరచుకున్నారు. కాగా ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన మరో మావోయిస్టు చనిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## హనీమూన్ మర్డర్ కేసులో కొత్త మలుపు

రాజా రఘువంశీ హత్య కేసు దర్యాప్తు సాగుతున్న కొద్దీ రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. ఈ సంచలన హత్య కేసులో లేటెస్ట్‌గా మరో పేరు తెరపైకొచ్చింది. సోనమ్ ఫోన్ నుండి లభించిన ఆధారాల ప్రకారం సంజయ్ వర్మ అనే మరో వ్యక్తి గురించి పోలీసులు కీలక నిజాలు బయటపెట్టారు. సోనమ్‌కు సంజయ్‌తో ఉన్న సంబంధంపై ఊహాగానాలు చెలరేగుతున్న నేపథ్యంలో.. ఆ వ్యక్తి మరెవరో కాదని, రాజా రఘువంశీ హత్యకు పథకం వేసిన సోనమ్ ప్రియుడు రాజ్ కుష్వాహానే అని మేఘాలయ పోలీసులు వెల్లడించారు. రాజ్ పేరును సోనమ్ సంజయ్ వర్మగా ఫీడ్ చేసుకుని- - - పెళ్లికి ముందు 39 రోజుల వ్యవధిలో ఏకంగా 234 సార్లు కాల్ చేసిందని వెల్లడించారు. అంతేకాదు- - - ప్రతిరోజూ నాలుగు నుంచి ఐదుసార్లు కనీసం 30 నుంచి 60 నిమిషాలు మాట్లాడుకునేవారని కాల్ రికార్డులు చూపించారు పోలీసులు. ఓ పథకం ప్రకారం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు సోనమ్- - - రాజ్ నంబర్‌ను సంజయ్ వర్మ అని సేవ్ చేసుకుందన్నారు. ఇక మే 11న రాజా రఘువంశీ, సోనమ్ వివాహం జరగ్గా- - - సరిగ్గా నెలరోజులకు జూన్ 11న సోనమ్ తన భర్తను హత్య చేసినట్లు అంగీకరించింది. ఇక ఈ మర్డర్ కేసులో సోనమ్‌తో మరో నలుగురిని పోలీసులు ఇప్పటికే అరెస్ట్ చేశారు.



## 215 మృతదేహాలకు డీఎన్ఏ మ్యాచింగ్.. 198 డెడ్‌బాడీస్ అప్పగింత

అహ్మదాబాద్‌లో ఎయిర్ ఇండియా విమానం కుప్పకూలి 270 మందికిపైగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. అయితే, వారం రోజులు పూర్తైనా మృతుల గుర్తింపు ప్రక్రియ ఇంకా పూర్తి కాలేదు. డీఎన్ఏ పరీక్ష ద్వారా ఇప్పటి వరకూ 215 మంది బాధితుల వివరాలను గుర్తించినట్లు అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ రాకేశ్ జోషి తెలిపారు. ఇప్పటి వరకూ 198 మంది డెడ్‌బాడీలను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు వెల్లడించారు. మిగతా మృతదేహాల అప్పగింత ప్రక్రియ కొనసాగుతున్నట్లు తెలిపారు. మరోవైపు మృతదేహాలను గుర్తించడానికి అహ్మదాబాద్‌లో డీఎన్ఏ ప్రయోగశాల 24 గంటలూ పనిచేస్తోంది. ప్రమాదంలో మృతదేహాలు గుర్తించలేనంత తీవ్రంగా కాలిపోవడంతో ఎముకల్లోని కణజాలాన్ని సేకరించి డీఎన్ఏ పరీక్షలు చేయాల్సి వస్తున్నదని.. అందుకే మృతదేహాల గుర్తింపు ఆలస్యమవుతున్నదని వైద్యులు తెలిపారు.



## 8 విమానాలను రద్దు చేసిన ఎయిరిండియా

ఎయిరిండియా సంస్థ నిర్వహణ సమస్యల వల్ల 8 విమానాలను రద్దు చేసింది. దుబాయ్ నుంచి చెన్నై రావాల్సిన ఏఐ 906, ఢిల్లీ నుంచి మెల్‌బోర్న్ వెళ్లాల్సిన ఏఐ 308, మెల్‌బోర్న్ నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ఏఐ 309, దుబాయ్ నుంచి హైదరాబాద్ రావాల్సిన ఏఐ 2204, పుణె నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ఏఐ 874, అహ్మదాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లాల్సిన ఏఐ 456, హైదరాబాద్ నుంచి ముంబయి వెళ్లాల్సిన ఏఐ 2872, చెన్నై నుంచి ముంబయి వెళ్లాల్సిన ఏఐ 571 విమానాలను రద్దు చేసినట్లు ప్రకటించింది.


## మరో విమానంలో సాంకేతిక సమస్య.. చెన్నైలో ఎమర్జెన్సీ ల్యాండింగ్

విమానాల్లో సాంకేతిక సమస్యలు ఆందోళన కలిగిస్తున్నాయి. గత పదిరోజులుగా ఎయిర్ ఇండియా సహా పలు విమానాల్లో సాంకేతిక సమస్యలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా చెన్నై నుంచి మధురైకి బయల్దేరిన ఇండిగో విమానంలో టెక్నికల్ సమస్యలు బయటపడ్డాయి. విమానం 68 మంది ప్రయాణికులతో శుక్రవారం ఉదయం 6:44 గంటల సమయంలో చెన్నై నుంచి మధురైకి బయల్దేరింది. విమానం టేకాఫ్ అయిన 30 నిమిషాల తర్వాత సాంకేతిక సమస్య తెల్తింది. అప్రమత్తమైన పైలట్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విమానాన్ని తిరిగి చెన్నైకి మళ్లించేందుకు అనుమతి కోరాడు. తిరిగి ఉదయం 7:17 గంటలకు విమానం చెన్నై ఎయిర్‌పోర్ట్‌లో అత్యవసరంగా ల్యాండ్ చేశారు. విమానం అక్కడ సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. అందులోని ప్రయాణికులను కిందకుదించి.. సమస్యను పరిష్కరిస్తున్నారు. ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలుస్తోంది.

## బెంగాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. తొమ్మిది మంది మృతి

పశ్చిమబెంగాల్ లో ఘోర రోడ్డుప్రమాదం చోటు చేసుకుంది. బొలేరో వాహనం ట్రక్కును ఢీ కొట్టింది. ఈ ఘటనలో తొమ్మిది మంది మృతి చెందారు. పురులియా జిల్లాలో శుక్రవారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బలరాంపూర్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని నామ్నోల్ సమీపంలోని జాతీయ రహదారి 18పై ఈ ఘటన చోటు చేసుకుంది. పురులియాలోని బారాబజార్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోగల అడబానా గ్రామానికి చెందిన పలువురు జార్ఖండ్‌లోని నిమ్డిహ్ ప్రాంతంలో తిలైతాండ్‌లో జరుగుతున్న ఓ వివాహ కార్యక్రమానికి బొలెరో వాహనంలో వెళ్లారు. కార్యక్రమం ముగించుకుని తిరిగి వస్తుండగా.. వీరు ప్రయాణిస్తున్న బొలేరో వాహనం అదుపుతప్పి ట్రక్కును బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో బొలేరో వాహనంలోని తొమ్మిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు వారిని సమీపంలోని ఆసుపత్రికి తరలించగా.. వారంతా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధరించారు. ఈ మేరకు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బల్కంపేట ఎల్లమ్మ ఆలయానికి నీతా అంబానీ రూ.కోటి విరాళం



రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ సతీమణి నీతా అంబానీ బల్కంపేట ఎల్లమ్మ, పోచమ్మ దేవస్థానానికి రూ.1 కోటి విరాళం అందజేశారు. ఈ మొత్తం జూన్ 19న దేవస్థానం బ్యాంకు ఖాతాలో జమ అయింది. అమ్మవారిపై ఎంతో నమ్మకంతో వస్తుండగా.. నీతా అంబానీకి దేవాలయ అధికారులు పలుమార్లు ఆలయ అభివృద్ధికి సహకరించాలని కోరారు. అయితే, ఇటీవల ఏప్రిల్ 23న హైదరాబాద్‌లో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌ను తిలకించేందుకు నీతా అంబానీ కాకుండా వారి తల్లి పూర్ణిమా దలాల్, సోదరి మమతా దలాల్ వచ్చారు. ఈ క్రమంలోనే అప్పటి ఈవో బీ క్రిష్ణ మరోసారి ఆలయ అభివృద్ధి అంశాన్ని వారికి గుర్తు చేశారు. కాగా, వారం రోజుల కిందట నగరంలోని రిలయెన్స్ సంస్థ ప్రతినిధులు దేవాలయ అధికారులకు రూ.కోటి విరాళానికి సంబంధించిన విషయాన్ని వెల్లడించారు. రెండు రోజుల కిందట ఈ నిధులు దేవాలయ ఖాతాలో జమైనట్టు ఈవో మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా అంబానీ కుటుంబానికి దేవస్థానం అధికారులు ధన్యవాదాలు తెలిపారు.

## ఆడపులికి క్లీంకార పేరు.. నెహ్రూ జూ పార్క్ బృందానికి థాంక్స్ చెప్పిన ఉపాసన



మెగా కోడలు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన హైదరాబాద్‌లోని నెహ్రూ జూలాజికల్ పార్క్ బృందానికి ధన్యవాదాలు తెలిపింది. జూలో ఉన్న ఒక ఆడపులికి తన కూతురి పేరు క్లీంకార అని పెట్టిన సందర్భంగా తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ ప్రత్యేక పోస్ట్ పెట్టింది. ఒక సంవత్సరం క్రితం, అది కేవలం ఒక చిన్న పులి పిల్ల. కానీ ఈ రోజు అల్లరి చేసే ఆడపులిగా మారింది. నా కూతురు క్లీంకార పేరునే ఈ పులికి పెట్టడం చాలా సంతోషంగా ఉంది. ఈ విధంగా ప్రేమాభిమానాలు చూపించిన నెహ్రూ జూలాజికల్ పార్క్ బృందానికి ధన్యవాదాలు. వన్యప్రాణులు అడవిలోనే ఉంటాయని మనం నమ్ముతుంటాం. అదేవిధంగా జంతువులను సంరక్షించే ప్రయత్నాలను సైతం మద్దతు తెలుపుతుంటాం. అని ఉపాసన రాసుకోచ్చింది. అనంతరం ఇద్దరు క్లీంకారలతో కలిసి దిగిన ఫొటోను ఉపాసన పంచుకుంది. నెహ్రూ జూలాజికల్ పార్క్‌లోని పులి పిల్లలను గురువారం ఉపాసన కొణిదెల దత్తత తీసుకుంది. తన కుమార్తె క్లీంకారతో కలిసి జూను సందర్శించిన ఆమె, అక్కడ వివిధ జంతువుల ఎన్‌క్లోజర్లను వీక్షించారు. అనంతరం జూపార్క్ డైరెక్టర్ డా. సునీల్ ఎస్. హిరేమత్‌ను కలిసి పులి పిల్లలను దత్తత తీసుకుంటున్నట్లు తెలియజేశారు.

## మెహ్రీన్ గ్లామర్ షో



మెహ్రీన్ తన పాఠశాల విద్యను అజ్మీర్‌లోని మాయో కాలేజ్ గర్ల్స్ మరియు అరవాలిలోని పాత్వేస్ వరల్డ్ స్కూల్‌లో పూర్తి చేసింది. ఆమె పోటీలో గెలిచి ప్రిన్సెస్ కసౌలి కిరీటాన్ని పొందింది.మెహ్రీన్ పిర్జాదా దక్షిణ చిత్ర పరిశ్రమలో బాగా ప్రాచుర్యం పొందింది. దీనితో పాటు, ఆమె అనుష్క శర్మ చిత్రం 'ఫిల్లౌరి'తో బాలీవుడ్‌లోకి ప్రవేశించింది.మెహ్రీన్ పిర్జాదా 'మహానుభావుడు' చిత్రానికి ఉత్తమ నటి అవార్డును కూడా గెలుచుకుంది.మెహ్రీన్ పిర్జాదా 'మహానుభావుడు' చిత్రానికి ఉత్తమ నటి అవార్డును కూడా గెలుచుకుంది.మెహ్రీన్ పిర్జాదా ప్రస్తుతం క్రొయేషియాలో సెలవులు గడుపుతున్నారు. ఈ సందర్భంగా, ఆమె కొన్ని చిత్రాలను పంచుకుంది.ఈ చిత్రాలలో, మెహ్రీన్ గ్లామరస్ శైలిలో నటిస్తోంది. అభిమానులు నటి లుక్‌ను చాలా ఇష్టపడుతున్నారు.

## బస్సులో 5 కోట్ల ఖరీదైన డ్రగ్స్ సీజ్.. ఓ మహిళ అరెస్టు




ఢిల్లీ నుంచి ముంబై వెళ్తున్న బస్సు నుంచి సుమారు 5 కోట్ల ఖరీదైన మాదకద్రవ్యాలను సీజ్ చేశారు. నైజీరియాకు చెందిన మహిళ నుంచి ఆ డ్రగ్స్‌ను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎవరి కోసమైతే డ్రగ్స్ తీసుకెళ్తున్నారో, ఆ వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నారు. బస్సులో దొరికిన డ్రగ్స్‌లో మెటాంఫెటమైన్ ఉన్నది. నిషేధిత వస్తువులను.. ఫుడ్ ప్యాకెట్లలో పెట్టి తీసుకెళ్తున్నారు. ఓట్స్, జూస్ టెట్రా ప్యాకెట్లలో డ్రగ్స్ స్మగ్లింగ్ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా.. ఢిల్లీ నుంచి వస్తున్న బస్సును డీఆర్ఐ అధికారులు అడ్డగించారు. ముంబైకి 50 కిలోమీటర్ల దూరంలోనే ఆ బస్సును తనిఖీ చేశారు. మహిళ నుంచి 2.56 కేజీల మెటాంఫటమైన్‌తో పాటు 584 గ్రాముల ఎక్స్‌టసీ ట్యాబెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ రెంటింటి విలువ 5 కోట్లు ఉంటుందని భావిస్తున్నారు. సాధారణంగా రేవ్ పార్టీల్లో మెటాంఫటమైన్, ఎక్స్‌టసీ ఎక్కువగా వాడుతుంటారు. నార్కోటిక్ డ్రగ్స్ చట్టం ప్రకారం నైజీరియా మహిళను అరెస్టు చేశారు.